



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

డబుల్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

» మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, జూలై 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో పూర్తి చేయాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అదనపు కలెక్టర్ రాధిక గుప్తతో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 30,068 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉండగా, అందులో 29,094 లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 974 ఇళ్ల కేటాయింపు ఈ వారంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 6,880 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డబుల్ బెడ్ రూమ్ జీహెచ్ఎంసీ ఈఈలు, జిల్లా పంచాయతీ ఆర్అండ్‌బీ అధికారులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎన్ఆర్ఎస్‌సీ శాస్త్రవేత డాక్టర్‌ప్రకాష్ చౌహాన్

అంతరిక్ష పరిజ్ఞానం పెంచుకోవాలి

మేడ్చల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానం పెంచుకోవాలని ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) స్టూడెంట్ అండ్ పబ్లిక్ ఔట్ రిచ్ హెెచ్ శాస్త్రవేత డాక్టర్ ప్రకాష్ చౌహాన్ అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో నిర్వహించిన స్పేస్ ఆన్ విల్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల అంతరిక్షంలో భారత దేశం ఎన్నో పరిశోధనలు చేసి పురోభివృద్ధి సాధించిందని తెలిపారు. సొంత సాంకేతికతను ఉపయోగించి ఉపగ్రహాలు తయారు చేసి అంతరిక్షంలో కొత్త పరిశోధనలు చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశం అంతరిక్ష పరిశోధనలో ఇతర దేశాలకు సాయం చేసే స్థాయికి చేరటం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్ర వేత్తలుగా మారి దేశం కోసం అంతరిక్ష పరిశోధనలు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, పాఠశాల కరస్పాండెంట్ మంజుల ప్రకాష్, ప్రిన్సిపాల్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు విస్తీర్ణం లెక్కను పక్కాగా తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సీజన్ల వారీగా పంటల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించే వెసులుబాటు ఉంటుంది. పంట వివరాలతో పాటు ఇప్పటి వరకు అయిన ఖర్చు.. ఏ పంట వేశారు, ఏమైనా తెగుళ్లు వచ్చాయా.. వీటి నివారణకు ఏ మందులు వాడారు.. తదితర వివరాలన్నీ పొందుపర్చుతారు. గత ఏడాదే దీన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా ఆచరణలో సాధ్యపడలేదు. అయితే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో ఈ యాప్‌ను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంట పొలాలకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తారు.

- ప్రత్యేక యాప్‌లో సాగు వివరాలన్నీ అప్‌లోడ్
- క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే
- సెప్టెంబర్ నాటికి వానాకాలం సీజన్ లెక్క పూర్తి
- భూధార్ కార్డులకు అనుసంధానం
- ఉమ్మడి జిల్లాలో 2లక్షల మందికి భూధార్ జారీ



సాగు లెక్క ఇక పక్కా

వ్యవసాయం డిజిటలైజేషన్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు ఆచరణలోకి వస్తున్నాయి. సీజన్ల వారీగా వ్యవసాయ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి వీటిని విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి. సాంకేతికత జోడించి వ్యవసాయ రంగాన్ని ప్రణాళికాబద్ధంగా మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యతో భూధార్ కార్డులను జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇది కాకుండా ఇప్పుడు సీజన్ల వారీగా పంటసాగు వివరాలను పక్కాగా లెక్కించేందుకు డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను అమల్లోకి తెచ్చారు. గత ఏడాదే దీన్ని అమల్లోకి తీసుకువచ్చే ప్రయత్నించినా ఆచరణలో సాధ్యపడలేదు. అయితే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో ఈ యాప్‌ను సద్వినియోగంలోకి తీసువస్తున్నారు. సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయిలో దీన్ని అమల్లోకి తీసుకువస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆగస్టు నుంచి మండల వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సాగు వివరాలన్నీ నమోదు చేయనున్నారు. సాధారణంగా గ్రామస్థాయిలో సాగు వివరాలను ఎప్పటికపుడు వ్యవసాయ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. క్షేత్రస్థాయికి సరిగా వెళ్లకుండానే స్థానికంగా ఉన్న సమాచారం మేరకు రిజస్టర్‌లో వివరాలను నమోదు చేసి వీటిని పై అధికారులకు పంపుతారు. అయితే వీటిని పలుమార్లు సవరిస్తుండడం పరిపాటి. ఈ విధానంలో అనేక తప్పులు జరుగుతున్నాయి. ఇప్పుడు కేంద్రం అమల్లోకి తెచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే ఇక పక్కాగా సాగు లెక్క తేల్చనుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో గత ఏడాది అమలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే వ్యవసాయ రంగంలో

మిగతా 7వ పేజీలో...



మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

సమాజ సేవతోనే జీవితం సార్థకం

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే జీవితం సార్థకమవుతుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన లయన్స్ క్లబ్ 37వ సంస్థాపన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సమాజం పట్ల ప్రతీ ఒక్కరు సేవాభావంతో ఉండాలన్నారు. అనంతరం కొడంగల్ లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా మురహరి వశిష్ట, కార్యదర్శిగా భీమారాజు, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ గవర్నర్ నటరాజ్, కమిటీ చైర్మన్ ముద్దప్పదేశ్‌ముఖ్, మృంత్యుంజయ, లయన్స్‌క్లబ్ సభ్యులు దానప్పయాదవ్, రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, శ్రీకిషన్‌రావు, జయతీర్థచారి, శివరాజ్‌పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్‌గుప్త, వెంకట్‌రెడ్డి, మిఠాయిరాజు, బాల్‌రాజ్, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై
నేతల దృష్టి
అనుచరులకు పోస్టులు
ఇప్పించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నాలు
పార్టీ పెద్దలు, సీఎంకు వినతులు 7



మూగ జీవాలకు
అందని వైద్యం
తాండూరు పశువైద్యశాలకు రాని
ఇన్‌చార్జి వైద్యాధికారి
కాంట్రాక్ట్ అటెండరే అన్ని తానై విధులు
ఇబ్బందులు పడుతున్న పశు పోషకులు 6



చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం

దంచికొట్టిన వాన

ఘట్‌కేసర్, జూలై 17 (ఇంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో వర్షం దంచికొట్టింది. 15 రోజులుగా వర్షం జాడ లేక జనం అల్లాడిపోయారు. గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రానికి చిరుజల్లులు పలకరించాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. అనంతరం ఉరుములు మెరుపులతో మోస్తారు వర్షం పడింది. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణం చల్లబడటంతోపాటు వరినాట్లు వేయడానికి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈవర్షం ఎంతో ఊరటనిచ్చింది.

మహిళా వృద్ధితోనే దేశాభివృద్ధి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

» ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు
» లబ్ధిదారులకు చెక్కులు, రేషన్ కార్డులు అందజేత



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ కలెక్టర్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాలు, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.9.12 కోట్ల వడ్డీ మాఫీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలనే ఆశయంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాల సభ్యులు డ్రోన్ వ్యాపారం చేస్తున్నారని, మహిళలు వివిధ రకాలైన వ్యాపారాలు చేసేందుకు ధైర్యంగా ముందుకు రావాలన్నారు. మహిళా సంఘాల్లో సభ్యులు ప్రమాదశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా అందుతుందని, సాధారణ మరణం పొందితే రూ.2 లక్షలు అందుతాయన్నారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 32.70 కోట్లు మిత్తి మాఫీ జరిగిందని, ఇందులో

మిగతా 8వ పేజీలో...



గీత వాహిని ముగింపు కార్యక్రమంలో మహిళలు

భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలి

గీతా వాహిని వ్యవస్థాపకురాలు శ్రీదేవి

వికారాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలని, బడి పిల్లల పాఠ్యాంశంలో భగవద్గీతను చేర్చాలని గీతా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా వికారాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భగవద్గీత పారాయణం నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమాన్ని వైభవలక్ష్మి ఆలయంలో గీతా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ భగవద్గీతను చేర్చాలని, సనాతన ధర్మ పరిరక్షణకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏనిమిదేళ్లుగా భగవద్గీత తరగతులు నిర్వహించి, సుమారు వెయ్యి మంది మహిళలకు, 600 మంది విద్యార్థులకు భగవద్గీతను నేర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, మాజీ ఎంపీపీ చంద్రకళ గీతా వాహిని ఉపాధ్యక్షురాలు మొబిగారి లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, కమిటీ సభ్యులు ఝాన్సీలక్ష్మి, విజయ, నీరజ, మాధురి, సునీత, వరలక్ష్మి, స్వాతి, జోత్స్న, సరల, కరుణ, సుధా, నాగరాణి, సంజీవరాణి, సరిత, రజిత, లక్ష్మి, మమత, సుమ, స్వరూపారమేష్, అర్చకులు విక్రమ్ ఉన్నారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్‌లోని శుభం ఫంక్షన్‌హాల్‌లో సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ కింద 619 స్వయం సహాయక సంఘాలకు రూ.38 కోట్ల 86 లక్షలు, ఐదు మండలాలకు 3,698 స్వయం సహాయక సఘాల సభ్యులకు వడ్డీ రాయితీ కింద కోటీ 79 లక్షలు, ఐదుగురు మహిళలకు లోన్ బీమా కింద రూ.3 లక్షల విలువైన 19 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్‌లు నడిపించే బాధ్యత అప్పగించామన్నారు. గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించేలా కృషి చేశామన్నారు. అర్హులైన ప్రతి మహిళకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రాధికా గుప్త, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఇంచార్జ్ డీఆర్‌డీఓ శాంతమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

జిల్లా మైనార్టీ అధికారి రాజేశ్వరి

వికారాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి పేర్కొన్నారు. నేటి(18వ తేదీ) నుంచి ఆగస్టు 18 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థి వయస్సు 26 ఏళ్ల లోపు ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో, లేదా వికారాబాద్ కలెక్టరేట్‌లోని ఐడీవోసీ భవనం రెండో అంతస్తు, రూమ్ నంబర్ ఎస్ 16లో ఉన్న మైనార్టీ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 79933 57103 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నాటుడెందుకు.. నరుకుడెందుకు?

విద్యుత్ తీగల సాకుతో చెట్ల తొలగింపు



పోచారం రోడ్డులో చెట్లను యంత్రంతో కోసేసిన దృశ్యం

- విద్యుత్ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు
- కళ తప్పుతున్న రహదారులు

ఘట్‌కేసర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అధికారులు, నాయకులు చెబుతున్నవన్నీ వట్టి మాటలవుతున్నాయి. విద్యుత్ వైర్లు తాకుతున్నాయనే సాకుతో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో 20 ఏళ్లకు పైగా వయసున్న చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. పచ్చదనం పెంపే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నారు. అవి కాస్తా పెరగగానే విద్యుత్ సిబ్బంది వైర్లు తగులుతున్నాయని తొలగించడం ఏటా సర్వసాధారణమైంది. గతంలో విద్యుత్ తీగలకు తగిలే

మిగతా 8వ పేజీలో...



సంస్కృతి టౌన్‌షిప్‌లో చెట్ల నరికివేత

అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే నెపంతో విద్యుత్ కాంట్రాక్టర్లు చెట్లను మొదళ్ల వరకు నరికేయడంపై టౌన్‌షిప్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం టౌన్‌షిప్‌లో విద్యుత్ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా చెట్లను యంత్రాలతో నేలకూల్చారు. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్లేడ్‌తో గొంతు కోసి హత్యాయత్నం

● చిల్కమర్రిలో బోనాల ఉత్సవాల్లో ఘటన


గాయ పడిన రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి చిల్కమర్రిలో గురువారం రాత్రి జరిగిన బోనాల ఉత్సవాల్లో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామస్తులు బోనాలతో ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పిస్తుండగా శివకృష్ణారెడ్డి అనే వ్యక్తి అక్కడ నిలబడి ఉన్న రవీందర్‌రెడ్డి గొంతును బ్లేడ్‌తో కోశాడు. రవీందర్‌రెడ్డి వద్దకు వచ్చిన శివకృష్ణారెడ్డి అతడి కళ్లు మూసి బ్లేడ్‌తో గొంతుకోశాడు. దాడిని అడ్డుకునేందుకు యత్నించిన సత్యంరెడ్డిపై శివకృష్ణారెడ్డి దాడి చేయగా అతడికీ గాయాలయ్యాయి. రవీందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అయితే శివకృష్ణారెడ్డి అన్న హరికృష్ణారెడ్డి రెండు రోజుల కింద రవీందర్‌రెడ్డిని దూషించగా రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు హరికృష్ణారెడ్డిని తీసుకెళ్లి విడిచిపెట్టారు. కక్షతోనే దాడిచేసినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గొంతు కోసిన శివకృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

భూ సర్వే చేయొద్దని ఘర్షణ

ఫూడూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): ఫూడూరు మండలం చెన్‌గోముల్‌లో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. గ్రామానికి చెందిన నరేష్ అక్క పేరిట 5ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని గురువారం సర్వేయర్‌తో సర్వే చేయించగా పొరుగు వారు అడ్డుకున్నారు. సర్వే చేయరాదంటూ నిలువరించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. రెండు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మూగ జీవాలకు అందని వైద్యం

- తాండూరు పశువైద్యశాలకు రాని ఇన్‌చార్జి వైద్యాధికారి
- కాంట్రాక్ట్ అటెండరే అన్నీ తానై విధులు
- ఇబ్బందులు పడుతున్న పశు పోషకులు

తాండూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిషత్ ఆవరణలోని పశువైద్య కేంద్రంలో వైద్యులు లేక సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు ప్రాంతాల రైతులు, పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు అస్వస్థతకు గురైనప్పుడు ఆసుపత్రికి తీసుకొస్తే వైద్యం చేసే వారు లేక ఆందోళన చెందుతున్నారు. మరికొందరు ఆసుపత్రికి కొంత దూరంలోని ప్రైవేట్ పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. తాండూరు పశువైద్య కేంద్రంలో పనిచేసిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ గత ఏప్రిల్ 2న బదిలీ అయ్యారు. కొడంగల్ ఇన్‌చార్జి పశువైద్యాధికారి నోవాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మూడు నెలలు దాటినా డాక్టర్ నోవా ఒక్కసారికూడా తాండూరు పశువైద్యశాలకు రాలేదు. ఇక్కడ ఉన్న కాంట్రాక్ట్ అటెండర్ మల్లేశం ఒక్కడే అరకొర వైద్యంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ఆస్పత్రికి సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, తాండూరు పట్టణ, ఇతర గ్రామాల పశువులు, పెంపుడు జంతువులను వాటి యజమానులు చికిత్స కోసం తీసుకువస్తుంటారు. ఇక్కడ వైద్యుడు లేక, కాంట్రాక్ట్ అటెండరే దిక్కు వడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు సైతం అటెండరే జాతీయ జెండావిష్కరణ చేశాడు. మరోపక్క పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సైతం ఇవ్వడం లేదు. ఏడాది కాలంగా గొర్రెలకు నట్టల మందు వేయడం లేదు. గురువారం అంతారం తండాకు చెందిన బబ్యానాయక్ తన మేకకు చికిత్స కోసం తీసుకురాగా రాగా, ఆస్పత్రిలో ఎవరూ లేక ఇబ్బందిపడ్డాడు. పట్టణానికి చెందిన మరో మహిళ తన కుక్కను వైద్యం కోసం తీసుకొచ్చారు. ఎవరూ లేక వారు వేచి చూసి వెళ్లిపోయారు. కాగా ఉన్న అటెండర్ సైతం సంతకాల కోసమని ఇన్‌చార్జి వైద్యుడు నోవా వద్దకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.


వైద్యం కోసం తాండూరు పశువైద్య కేంద్రానికి జంతువులను తెచ్చిన స్థానికులు


తాండూరు పశువుల ఆస్పత్రి

రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి


అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కొడంగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. దరఖాస్తులను ప్రత్యేక చొరవతో పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20ఏళ్ల జైలు


రంజీత్‌సింగ్

శంషాబాద్ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన లైంగికదాడి ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. బిహార్ రాష్ట్రానికి చెందిన రంజీత్‌సింగ్ శంషాబాద్‌కు చెందిన ఓ బాలికపై లైంగికదాడి చేయగా కేసు నమోదైంది. గురువారం రాజేంద్రనగర్ కోర్టు జడ్జి కేసు విచారణ చేసి రంజీత్‌సింగ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బాధితురాలికి రూ.3లక్షల పరిహారం అందించాలని న్యాయాధికారి ఆదేశించారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి


అమ్మవార్లను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం వికారాబాద్ పరిధి గిరిగేట్‌పల్లిలో ఎల్లమ్మ, పోచమ్మ తల్లి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టాపన పూజలకు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆషాఢంలో అమ్మవార్లను తెలంగాణ ప్రాంతంలో పూజిస్తారని, పిల్లాపాపలు చల్లగా జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంతరెడ్డి, మేక చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీని అరెస్టు చేయాలి

యాలాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): జుంటుపల్లి మాజీ ఎంపీటీసీ పెండ్యాల వెంకటరాంరెడ్డిని అరెస్టు చేయాలని కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డీటీ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. దళితులపై అరాచకాలకు పాల్పడుతున్న వెంకటరామిరెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దళితుడు నెత్తి వెంకటప్ప గ్రామంలో తిరిగితే బెదిరిస్తున్నాడని అన్నారు. వెంకటరాంరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎడ్ల సురేష్, కృష్ణ, నెత్తి పకీరప్ప, నర్సింహులు, బల్ల పకీరప్ప, బుడెం అంజిలప్ప, చిన్న హన్మంతు తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహణతో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండల్‌రెడ్డి

షాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహిస్తే పాడి రైతులు లాభాలు పొందొచ్చని రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ కె.కిషన్‌కుమార్, పశువైద్య విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం ముద్దెంగూడలో వెటర్నరీ వర్సిటీ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో డెయిరీ నిర్వహణ, పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో డెయిరీ నిర్వహణ చేయాలన్నారు. ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార నైపుణ్యాల ద్వారా స్వయం ఉపాధి పొందాలన్నారు. డాక్టర్ శివకుమార్, డాక్టర్ సాహిత్యారాణిలు మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి ద్వారా కోవా, పనీర్, రస్మలాయ్, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్‌మిల్క్ వంటి పాల ఉత్పత్తుల తయారీపై వివరించారు. పాడిరైతులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, సుగుణమాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు లింగం, చంద్రశేఖర్‌గుప్తా, యాదయ్య, కృష్ణ, నగేశ్, రాములు, మహేందర్, కళావతి, లావణ్య పాల్గొన్నారు.

కామినేనిలో తలసేమియా ఉచిత సేవలు భేష్


తలసేమియా వైద్యశిబిర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, తదితరులు

మన్సూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితులకు కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత సేవలు అభినందనీయమని రంగారెడ్డి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బలుసు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి తలసేమియా బాధితుల కోసం రూపొందించిన ఉచిత వైద్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పిల్లల్లో వచ్చే తలసేమియా వ్యాధి పట్ల కామినేని వైద్యులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఉచిత హెమటాలజీ శిబిరం నిర్వహించడం శుభపరిణామన్నారు. నిత్యం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోదలచిన వారు సెల్ నంబర్ 8985450534లో సంప్రదించాలని కామినేని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. అంజయ్య సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.పాపారావు, డా.పూనమ్, డా.రాధిక, జిల్లా ఉపవైద్యాధికారులు డా.పూర్ణిమ, డా.వి.విజయలక్ష్మి, డా.గీత, డా.నాగేంద్రబాబు, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జూలై 17(ఆంధ్రజ్యోతి):పరిగి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యంతో అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం దోమ మండలం దాదాపూర్-గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి వద్ద రూ.75కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేయించి సింగిల్ రోడ్డును ఇప్పుడు డబుల్ రోడ్డుగా మార్చేందుకు పనులను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో పరిగి, షాద్‌నగర్, వికారాబాద్ రోడ్లను నాలుగు లేన్ల రోడ్లుగా మార్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డు మంజూర్‌కు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అప్పా జంక్షన్ వరకు రోడ్ల మంజూరైనా కొన్ని కేసులుండటంతో పనులు ఆగిపోయాయన్నారు. త్వరలోనే వాటిని పరిష్కరించి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పూడూరు: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కటిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి ఎన్కెపల్లి, గొంగుపల్లి, మన్నెగూడ గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొదటి విడతలో ఇళ్లురాని వారికి రెండో విడతలో వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సురేందర్, ప్యాక్స్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, షకీల్, అజీమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఊరూ వాడా ఘనంగా బోనాలు


మధురాపూర్‌లో బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

షాద్‌నగర్ అర్బన్/నవాబుపేట/షాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆశాడ మాసాన్ని పురస్కరించుకుని గురువారం పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఊరూ, వాడల్లో బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. షాద్‌నగర్‌తో పాటు గ్రామాల్లో ఉన్న పోచమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలను సమర్పించారు. బ్యాండ్ మేళాలతో బోనాలను ఊరేగింపు నిర్వహించి ఆలయాల చుట్టూ ప్రదక్షణ చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పొట్టేళ్లు, మేకపోతులు, కోడిపుంజులను అర్పించి మొక్కె. బడులను తీర్చుకున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన గ్రామీణులు బోనాల కోసం సొంత గ్రామాలకు వచ్చి దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, పార్టీల నాయకులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. నవాబుపేట మండలంలోని దాదాపూర్‌లో గురువారం గ్రామ దేవతలకు బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బలవంత్‌రెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. బోనాల ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జంగయ్య, బోజిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. షాబాద్ మండలంలోని కుర్వగూడ, బొబ్బిలిగామ, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు దరువులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు సల్లంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


దాదాపూర్ బోనాల్లో పోతురాజుల విన్యాసాలు


షాబాద్: బోనాలతో ఆలయానికి తరలుతున్న మహిళలు


ఆలయం వద్ద ఎంపీ రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు

మేడ్చల్ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గురువారం మేడ్చల్ పట్టణం కిందిబస్తీ నల్ల పోచమ్మకు భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వచ్చి నైవేద్యం సమర్పించుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల యువజన సంఘాలు ఫలాహారం బండ్లతో, పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ బోనాల ఉత్సవాలకు మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఉన్నారు. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

శంషాబాద్ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం సెంట్రల్ రోడ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సీఆర్ఆర్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఎన్‌హెచ్ 44 నుంచి అల్లికోల్ తండా, మదన్‌పల్లి వరకు, పిల్లోనిగూడ నుంచి తిమ్మాపూర్ రైల్వే గేటు, ముక్తగూడ మీదుగా నానాజీపూర్ వరకు కోట్లాది రూపాయలతో చేపట్టే పనులకు శ్రీకారం చుట్టారు. పనులను గడువులోపు నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

నాపరాతి వ్యాపారికి కుచ్చుటోపీ

» లారీ పంపుతున్నామని రూ.17,500 కాజేసిన వైనం

తాండూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి):నాపరాతి వ్యాపారికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం తట్టేపల్లికి చెందిన మ్యాదరి అరుణ్‌కుమార్ తాండూరు మండలం అంతారంలో పాలిషింగ్ యూనిట్లు నిర్వహిస్తున్నాడు. వివిధ ప్రాంతాలకు నాపరాతి లోడ్లు తరలిస్తుంటాడు. రెండు రోజుల క్రితం అస్సాంలోని గువహటి వ్యాపారికి లోడ్ పంపించాల్సి ఉంది. దీంతో అరుణ్‌కుమార్ న్యూ మహావీర్ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులకు ఫోన్‌చేసి లోడ్ తరలింపునకు లారీ కావాలని మాట్లాడారు. బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి మహావీర్ ట్రాన్స్‌పోర్టు నుంచి మాట్లాడుతున్నానని, లోడ్ కోసం లారీ (డబ్ల్యూబీ25 ఎల్3030)ని పంపిస్తున్నట్టు చెప్పాడు. లారీ ఫొటోతో పాటు, దాని ఆర్సీ కార్డును వాట్సాప్ చేశాడు. డీజిల్ కోసం రూ.17,500 ఆన్‌లైన్‌లో పంపితే లారీ పంపుతానని చెప్పాడు. ఇదంతా నిజమని నమ్మిన అరుణ్‌కుమార్ అతడు చెప్పిన సెల్ నం:9621315968(అంకిత్ కుమార్ కుశ్వాహ్)కు రూ.15వేలు ఒకసారి, రూ.2,500 మరోసారి ఫోన్‌పే చేశాడు. గడువు దాటినా లారీ రాకపోవడంతో అరుణ్‌కుమార్ సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


వ్యాపారి వాట్సాప్‌కు నేరగాళ్లు పంపిన లారీ ఫొటో

కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ

తాండూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కారం చేడు, చుండూరు దళిత మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్ పాల్గొన్నారు. కారంచేడు నరమేధం జరిగి 40ఏళ్లయినా ఆ దుర్ఘటనను మరవలేకపోతున్నామన్నారు. దళితులపైన జరిగిన దాడిని స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. 23ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత కోర్టులో దోషులకు శిక్ష పడిందని గుర్తుచేశారు. కారంచేడు బాధితుల పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ మాట్లాడుతూ.. దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరులో ఎంతో మది అసువులు బాసారని అన్నారు. కార్యక్రమానికి కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్పుల చంద్రప్ప అధ్యక్షత వహించారు. బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్తార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధితోనే అభివృద్ధి

షాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సుస్థిర జీవనోపాధి అవసరమని యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈవో రేఖశ్రీనివాసన్, మైక్రోసాఫ్ట్ సంస్థ టీం మెంబర్ శ్రీచందన్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల స్వామి అన్నారు. గురువారం వీరి సహకారంతో చందన్‌వెల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ(వీడీఎస్) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. 16 మహిళలకు వర్కింగ్ యూనిట్లు, 8 షెడ్‌నెట్లు, డెయిరీ ఫామ్ యూనిట్లు అందజేశారు. పంచాయతీ ఆఫీసుకు సోలార్ సిస్టం, స్కూల్‌కు స్పోర్ట్స్ కిట్ అందజేశారు. క్రీడాపోటీలు నిర్వహించారు. మహిళలు, యువత, రైతులు ఆర్థిక స్వావలంబన కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు భరత్, రాములు, సాయికృష్ణ, మహేశ్వరి, గ్రామస్తులు వెంకటయ్య, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్, హరిచరణ్, యాదయ్య, కృష్ణగౌడ్, రాంచందర్, రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఆమనగల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి):. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యేమాజీ ఎంపీపీ అనంతరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ .. పదేళ్ల తర్వాత రేషన్ కార్డులిచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ పాలకులు కాలయాపన చేశారు తప్ప పేదలకు గూడు కల్పించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, జగన్, మానయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై నేతల దృష్టి



» అనుచరులకు పోస్టులిప్పించేందుకు ఎమ్మెల్యే బుయ్యని ప్రయత్నాలు
» ఇప్పటికే రాష్ట్ర పార్టీ పెద్దలకు, సీఎంకు వినతులు

తాండూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపరంగా ఇచ్చే నామినేటెడ్ పదవుల కేటాయింపుపై తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టి సారించారు. దీనిపై పార్టీ, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఒక రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవితో పాటు మూడు డైరెక్టర్ పోస్టులు తాండూరు నియోజకవర్గానికి కేటాయించాలని ఎమ్మెల్యే కోరుతున్నారు. తాండూరుకు చెందిన కల్వ సుజాత రాష్ట్ర ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్‌గా ఎం.రమేశ్, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ధారాసింగ్ కొనసాగుతున్నారు. సుజాత తాండూరు ప్రాంత వాసే అయినా ఏళ్లగా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్‌గా, అధికార ప్రతినిధిగా సేవలందించినందున ఆమెకు పదవి దక్కిందని చెబుతారు. ఎం.రమేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు టికెట్‌ను త్యాగం చేసినందుకు పదవిచ్చారు. ఎస్టీ కోటాలో ధారాసింగ్‌కు పార్టీ పదవికట్టబెట్టారు. ఇప్పుడు ఏదేని కార్పొరేషన్ డైరెక్టర్ పదవులను మైనార్టీ వర్గం నుంచి ఆమెర్, రవూఫ్, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, మల్కాపూర్ జనార్దన్‌రెడ్డి ఆశిస్తున్నారు. ఇప్పటికే డీసీసీ చీఫ్ పదవికోసం ఉత్తమ్‌చంద్ దరఖాస్తును చేసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డ జనార్దన్‌రెడ్డికి ఏదైనా డైరెక్టర్ పదవిప్పించాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇక ధారాసింగ్ ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవిస్తేనే తీసుకోవాలనే తలంపులో ఉన్నట్టు తెలుస్తోంది. అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వంలో తాండూరుకు చెందిన ఆర్.బస్వరాజ్‌కు శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి పదవి ఇచ్చారు. తాండూరు ప్రాంతం వీరశైవ భక్తులు భారీ సంఖ్యలో శ్రీశైలానికి వెళ్తుంటారు. ఇప్పుడు కూడా ఏపీ ప్రభుత్వంతో చర్చించి తాండూరుకు ప్రాంత వీరశైవ సమాజ నాయకుడికి శ్రీశైలం ధర్మకర్త పదవి ఇప్పించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కోరుతున్నారు. ఈ పదవిని మహిళా నేతలు గాజుల మాధవి, ప్రభావతి తదితరులు ఆశిస్తున్నారు. అలాగే సొసైటీ చైర్‌పర్సన్ల పదవులను కూడా కేటాయించాలని చూస్తున్నారు.

మహేందర్‌రెడ్డి వర్గానికి పదవులొచ్చేనా?

మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి వర్గం కూడా పదవులు ఆశిస్తోంది. ఎమ్మెల్యే వర్గానికి కేటాయింపులు పోను విప్ అనుచరులకు పదవులు వస్తాయా? లేదా? అనే చర్చా నడుస్తోంది. మహేందర్‌రెడ్డి ముఖ్య అనుచరుడుమాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు పార్టీలో రాష్ట్రస్థాయి పదవి ఇచ్చినా ప్రభుత్వ నామినేటెడ్ పదవిపై ఆయన ఆశలుపెట్టుకున్నారు. అలాగే మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పరిమళ పదవులను ఆశిస్తున్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి వెంట బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పురుషోత్తంరావు, శ్రీనివాస్‌లకు ఏదో ఒక ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇప్పించేందుకు చీఫ్‌విప్ ప్రయత్నిస్తున్నట్టు పార్టీలో చర్చించుకుంటున్నారు.

సాగు లెక్క ఇక పక్కా



(ఐదో పేజీ తరువాయి)

భారీ మార్పులు చోటు చేసుకుంటాయి. పంటల వివరాలు పక్కాగా అందుబాటులో ఉండడంతో భవిష్యత్ ప్రణాళికలకు కూడా ఢోకా ఉండదు. మార్కెట్‌లో ఏఏ పంటలకు డిమాండ్ ఉంటుంది? చీడపీడలు, వాతావరణ మార్పుల కారణంగా ఆయా పంటలకు జరుగుతున్న నష్టంపై అంచనాలు ఉంటాయి. తద్వారా వీటి నష్ట నివారణకు ఆస్కారం ఉంటుంది. వ్యవసాయ అధికారులు పంట పొలాలకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా ఆయా రైతుల పంటల సాగు, విస్తీర్ణం, ఎరువులు, పురుగు మందుల వినియోగంతో ఇతర వివరాలను నమోదు చేస్తారు. ఈ మొబైల్ యాప్‌కు భూనక్షాను అనుసంధానం చేయడంతో వివరాలు నమోదు చేసే అధికారి పొలంలోకి వెళ్లి యాప్ ఆన్ చేయగానే శాటిలైట్ లొకేషన్ ఆధారంగా నక్షా ప్రకారం భూమి ఏ సర్వే నంబరులో ఉన్నదనే విషయం తెలిసిపోతుంది. తద్వారా నిలిచి ఉన్న ప్రాంతానికి చుట్టూ 50 మీటర్ల పరిధిలోని విస్తీర్ణాన్ని ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. దీని ప్రకారం అక్కడ నుంచి రైతు వివరాలు, ఆధార్, భూధార్‌తో పాటు సాగు వివరాలన్నీ నమోదు చేస్తారు. పంట వివరాలతో పాటు ఇప్పటి వరకు అయిన ఖర్చు, పంటలకు ఏమైనా తెగుళ్లు వచ్చాయా? వీటి నివారణకు ఏ మందులు వాడారు? అనే వివరాలన్నీ నమోదు చేస్తారు. ఈ యాప్ ద్వారా అధికారులు 17 రకాల సేవలు అందించనున్నారు.

రెండు లక్షల మందికి జారీ

దేశ పౌరులకు ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకూ ప్రత్యేకంగా భూధార్ పేరుతో గుర్తింపు కార్డు జారీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నప్పటికీ భూ కమతానికి సంబంధించి 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) కేటాయిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం.. ఈ ప్రక్రియను మొదలు పెట్టాలని ఇటీవలే రాష్ట్రాలకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం భూధార్ కార్డుల అందజేత కోసం తొలుత వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు పూర్తిచేసి వీటి జారీ ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటి వరకు రంగారెడ్డిజిల్లాలో దాదాపు లక్ష మందికి ప్రత్యేక కార్డులు అందించారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల మంది రైతుల పేర్లు భూధార్‌లో నమోదు కాగా, ఇందులో దాదాపు రెండు లక్షల మందికి కార్డులు జారీ అయ్యాయి. రంగారెడ్డిజిల్లాలో 97వేల మందికి, వికారాబాద్‌లో లక్షమందికి పైగా భూధార్ కార్డులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే భూములు, రైతులకు సంబంధించిన వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ రైతు రిజిస్టర్ కూడా అమల్లోకి తెచ్చారు. ఇందులో భూ యజమానులకు ఆయా సర్వేనంబర్లలో భూమి విస్తీర్ణంతో పాటు హద్దులు తదితర వివరాలను నమోదు చేసి భద్రపరుస్తారు. దీంతో రికార్డులన్నీ పారదర్శకంగా ఉండడంతో సులభంగా భూములకు సంబంధించిన అన్ని వివరాలను గుర్తించవచ్చు. అలాగే భూఆక్రమణలు, అక్రమ కట్టడాల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. అలాగే భూధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యను బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతో అనుసంధానం చేయనున్నారు. దీంతో రుణాలు ఇతర పథకాల అమలు మరింత సులభతరమవుతుంది. భవిష్యత్తులో రైతులకు అమలు చేసే వివిధ పథకాలతో పాటు ఎరువులు, ఇతర సబ్సిడీలకు భూధార్ ఆధారమయ్యే అవకాశాలు ఉన్నాయి.


హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు నిర్వహించిన జలాభిషేకం

వరుణ దేవా కరుణించవా..

మర్పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు లేక జనాలు అల్లాడుతున్నారు. పంటపొలాలు నెర్రెలుబారుతున్నాయి. వరుణ దేవా కరుణించవా.. వానలు సమృద్ధిగా కురిపించి పాడిపంటలను చల్లగా చూడాలని గురువారం మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామస్తులు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి విగ్రహం మునిగేంత వరకు జలాభిషేకం చేశారు.

నిరంతర పర్యవేక్షణతోనే నేరాల నియంత్రణ

ఆదిభట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. గురువారం ఆదిభట్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధి ప్రాంతాల్లో నిఘాపెట్టి, కూడళ్లలో సీసీ కెమారాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఆదిభట్ల పరిధిలో కంపెనీల్లో బాలలు పనిచేస్తే వారికి పని నుంచి విముక్తి కల్పించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పెండింగ్‌లో కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ రాఘవేందర్, ఎస్సై వెంకటేష్, సైదయ్య, నోయెల్ రాజు, సత్యనారాయణ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

గుర్తు తెలియని వ్యక్తులను నమ్మొద్దు

యాచారం: కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మాటల్లో పెట్టి ఏమార్చి అపకారం తలపెడతారని, అలాంటి వారిని నమ్మొద్దని ఏసీపీ కేపీవీ రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం యాచారం బస్టాండ్‌లో ప్రయాణికులతో, సాగర్ ప్రధాన రహదారిపై వెళ్తున్న వారితో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి.. 'తాగు నీరు ఇవ్వండి. ఫలానా గ్రామానికి ఎలా వెళ్లాలి?' అని అడిగి మహిళలను మాటల్లో పెట్టి బంగారు ఆభరణాలు లాక్కుపోతున్నారని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒంటరిగా ఉండే సమయాల్లో మహిళలు విలువైన ఆభరణాలు ధరించొద్దని సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్‌లో అడిగే సమాచారం, ఓటీపీలు చెప్పొద్దని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు మధు, సత్యనారాయణ, ప్రియాంక ఉన్నారు.



మండల సాధనకు అర్ధనగ్నంగా ఆందోళన

తలకొండపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): సమీప గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా చేపట్టిన ఉద్యమం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అలాగే రిలే నిరహారదీక్షలు 257వ రోజుకు చేరాయి. నాయకులు, యువకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. 11పంచాయతీలతో గట్టిప్పలపల్లిని మండలం చేయాలని మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్ వెంకటయ్య డిమాండ్ చేశారు. 11 పంచాయతీలతో కొత్త మండలం చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు.


ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రమందజేస్తున్న సీపీఎం నాయకులు

మౌలిక వసతులు కల్పించండి

» సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మంచాల మండలం లింగంపల్లి గేటు వద్ద లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం లబ్ధిదారులతో కలిసి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రమందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లింగంపల్లి గేట్ వద్ద 96 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేసి లింగంపల్లి, నోముల గ్రామాలకు చెందిన పేదలను లాటరీ పద్ధతిన ఎంపిక చేశారని ఆయన గుర్తు చేశారు. కాగా వసతులు లేని కారణంగా లబ్ధిదారులను గృహ ప్రవేశం చేయలేదన్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేదని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావుల జంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, పోశమోని కృష్ణ, అమృత, సరిత తదితరులున్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెంచాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై17(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లేరని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించడం పక్కనబెట్టి విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలకులు ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. సర్కారు బడుల్లో సౌకర్యాలు లేకే చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారని తెలిపారు. 150ఏళ్ల చరిత్ర కలిగి, పాఠశాల ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం వచ్చిన మొగిలిగిద్ద వంటి స్కూల్లోనూ విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాలున్న మొగిలిగిద్ద హైస్కూల్‌లో 480మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 34మంది టీచర్లలో 14 మందిని డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలలకు పంపే సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. సౌకర్యాలను పెంచకుండా టీచర్ల సంఖ్యను తగ్గిస్తూ పోతే వచ్చే ఏడాది మరింత మంది విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్తారన్నారు. అవసరమైతే మొగిలిగిద్ద స్కూల్‌ను రెసిడెన్షియల్‌గా మార్చాలని, అదీ కుదరకుంటే మొగిలిగిద్ద పేరిట షాబాద్‌లో నడుస్తున్న కేజీ టు పీజీ పాఠశాలను మొగిలిగిద్దకు తరలించాలని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మహేందర్‌రెడ్డి, డి.అశోక్‌గౌడ్, వెంకటేష్‌గుప్తా, హరిభూషన్, నర్సింహ, పద్మ కృష్ణయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

అందని సాంకేతిక విద్య

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అందుబాటులో లేని ప్రభుత్వ వృత్తి విద్యా కాలేజీలు

» టెక్నికల్ కోర్సులతో యువత ఉపాధికి అవకాశం
» ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు డిమాండ్

యాచారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఈ కాలంలో సాంకేతిక విద్యకు, సాంకేతిక పనివారికి డిమాండ్ ఉన్నా ప్రభుత్వ పరంగా ఆయా కోర్సులు, శిక్షణ సంస్థలు అందక గ్రామీణ ప్రాంత విద్యార్థులు నిరుద్యోగులుగా, ఉపాధి లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఏళ్లగా డిమాండ్ వస్తున్నా ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. సాంకేతిక విద్యకు ఎంతో మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నా స్థానికంగా శిక్షణా సంస్థలు లేక టెక్నికల్ ఎడ్యుకేషన్ చదువలేకపోతున్నారు. హైదరాబాద్‌లో ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఆర్థికస్థోమత లేక వ్యవసాయం, సెంట్రింగ్, మార్బుల్స్ వేయడం, బైక్ మెకానిక్, తాపీ మేస్త్రీలుగా జీవనం సాగిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటుచేయాలని విద్యార్థి సంఘాలు మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలందించినా ఫలితం ఉండడం లేదు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందించి ఈ ప్రాంతంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.



ప్రభుత్వ కాలేజీల్లేక నష్టపోతున్నారు



పేద విద్యార్థులకు సాంకేతిక విద్యపై ఆసక్తి ఉన్నా శిక్షణ ఇచ్చే ప్రభుత్వం కాలేజీలు లేక నష్టపోతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో ఉంటూ చదువుకునే ఆర్థిక స్థోమత లేక నిరుద్యోగులకు మిగులుతున్నారు. సాంకేతిక విద్యతో ఏదో ఒక ఉపాధి తప్పక లభిస్తుంది.

- విప్లవ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి, యాచారం

యువతకు సాంకేతిక విద్యే ప్రధానం



ఈ కాలంలో సాంకేతిక విద్య అవసరం. ఇబ్రహీంపట్నంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేస్తే వందలాది మంది విద్యార్థులు వృత్తి విద్య కోర్సు పూర్తిచేస్తారు. అలాంటి వారికి రెండుమూడేళ్ల లోపే ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఉద్యోగం లభిస్తుంది. ఉద్యోగం రాకున్నా సొంతంగా వారి ట్రేడ్‌కు సంబంధించన వర్క్‌షాప్ పెట్టుకొని ఉపాధి పొందుతారు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి.

- బి.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కుర్మిద్ద

వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు



ఇబ్రహీంపట్నంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు లేక చాలా మంది పేద విద్యార్థులు పది, ఇంటర్ వరకు చదివి వ్యవసాయం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఇక్కడ సాంకేతిక విద్య కళాశాలలు ఏర్పాటు చేయించాలి. మంచాల, రంగాపూర్, లేదా రాచకొండ గుట్టల్లో కళాశాలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

- సదా వెంకటరెడ్డి, జ్ఞాన సరస్వతీ సేవా ట్రస్ట్ చైర్మన్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని గొల్లగూడ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు గడువు లోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, గోవిందమ్మ, మల్లేశం, వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతా రాథోడ్‌సింగ్, రామ్‌రెడ్డి, ఇక్బాల్, ఖదీర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారురాలు ఉప్పలి లక్ష్మి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టగా గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్యలు పాల్గొని ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గొల్ల చందు, ఉప్పలి నర్సింహులు, ఉమేష్, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కీసర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కీసర గ్రామానికి చెందిన యాకరి అనిత ఇటీవల అనారోగ్యానికి గురై సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆమెకు రూ. 23,500 రూపాయాల నిధులు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గురువారం తన నివాసంలో అనిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కీసర టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పూడూరులో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య బృందం

పూడూరు, జూలై 17, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ అట్లూరి శ్రీమన్నారాయణ సాయి సేవా మందిరంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మన అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఈ శిబిరం నిర్వహించగా వివిధ విభాగాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన అమెరికా తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ కల్లాల మాట్లాడుతూ.. 30ఏళ్లుగా ప్రతీవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కులమతాలకతీతంగా పీర్ల పండుగ



ఉత్సవాల్లో నాయకులు

నవాబుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా పీర్ల పండుగ నిర్వహించుకోవడం సంతోషదాయకమని విద్య, మౌలిక వసతుల మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని అత్తాపూర్ గ్రామంలో గురువారం పీర్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పీర్ల పండుగను కులమతాలకతీతంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని చావిడిల్లో ప్రతిష్ఠించిన పీర్లను గ్రామస్థులు ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కావలి స్వరూప, భీమయ్య, అమరేందర్‌రెడ్డి, మల్లేశం, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజేందర్‌గౌడ్, విజేందర్‌గౌడ్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

కీసర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమ పూర్వీకుల సమాధుల శ్మశానవాటికకు హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కీసర ముదిరాజ్‌లు గురువారం తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కీసర రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 9లో 10గుంటల స్థలంలో తమ పూర్వీకుల సమాధులు ఏర్పాటు చేసినట్లు ముదిరాజ్‌లు తహసీల్దార్ అశోక్‌తో తెలిపారు.

రోడ్డుపై తోపుడు బండ్ల తొలగింపు



మాట్లాడుతున్న ఎంపీవో భాస్కర్‌గౌడ్

కులకచర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల చౌరస్తాలో రోడ్డుపై దుకాణాలు కొనసాగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో 15 రోజుల కిందట వారికి పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం రోడ్డుపై కొనసాగుతున్న కూరగాయలు, పండ్ల దుకాణాలను, తోపుడు బండ్లను గురువారం తొలగించారు. ఎంపీవో భాస్కర్‌గౌడ్, పంచాయతీ సిబ్బంది పోలీసులతో చౌరస్తాకు చేరుకొని దుకాణాదారులతో మాట్లాడారు. ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని వారికి సూచించారు. నూతనంగా మార్కెట్ యార్డులో దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మూడుచింతలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ భూమ కుమారి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులు గురువారం కేశవరం పరిధిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు



బషీరాబాద్: కాశింపూర్ శివారులో వర్షాభావంతో ఎదుగుదల లేని పత్తిపంట

బషీరాబాద్/చౌడాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో ముందస్తుగా మురిపించిన వరుణుడు ఆ తర్వాత ముఖం చాటేశాడు. బషీరాబాద్ మండలంలో వారం రోజులుగా మధ్యాహ్నం ఎండల తీవ్రతతో పత్తి, కంది, పెసర, మినుము పంటలు వాడుతుండగా, చెలకనేలల్లో మాత్రం ఎండుముఖం పడుతూ పరిస్థితి దయనీయంగా మారింది. 25 రోజులకు పైగా వర్షాల జాడ లేకుండా పోవడంతో పైర్లను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులు అక్కడక్కడా నీటి తడులతో పత్తి పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో వర్షాలు పడకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదం లేకపోలేదని రైతులు వాపోతున్నారు. బషీరాబాద్ మండలంలో 20వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వానాకాలంలో సాగుచేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పలువురు రైతులు పొలాల్లో స్పింకర్లను ఏర్పాటుచేసి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



పొలంలో స్పింక్లర్లతో పంటకు నీరు

నాటుడెందుకు.. నరుకుడెందుకు?

(ఐదో పేజీ తరువాయి)

కొమ్మలనే తొలగించేవారు, ప్రస్తుతం చెట్ల మొదళ్ల వరకు యంత్రాలతో కోసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జోడిమెట్ల, పోచారం రోడ్డులో..

జోడిమెట్ల నుంచి పోచారానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్దపెద్ద వృక్షాలను నెలకూల్చారు. నిత్యం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులోనే చెట్లను నరికేస్తే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో చెట్ల కొమ్మలను గొడ్డళ్లతో కొట్టేసేవారు. తిరిగి కొన్ని నెలల్లోనే ఆ చెట్లు మళ్లీ చిగురించేవి. ప్రస్తుతం చెట్టు మొత్తాన్నే తొలగిస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించే పనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న కాంట్రాక్టర్లు పనిలో పనిగా కలప అవసరం వస్తుందని యంత్రాలతో వృక్షాలను నేల కూలుస్తున్నారు. విద్యుత్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏటా చెట్ల సంఖ్య తగ్గిపోతున్నది. విద్యుత్ లైన్ల కింద తక్కువ ఎత్తు పెరిగే మొక్కలనే నాటడం, విద్యుత్ లైన్లకు తగిలే కొమ్మలను తొలగించడం వల్ల ప్రకృతిని కాపాడిన వారమవుతామని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఇష్టానుసారంగా నరికేస్తున్నారు



విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే కారణంతో చాలాచోట్ల చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. ఏళ్లుగా పెరిగిన చెట్లను నేల కూల్చడం సరికాదు. తీగలకు తగిలే కొమ్మలనే తొలగించాలి. ఆయా శాఖల అధికారులు కలిసి పని చేస్తేనే అది సాధ్యమవుతుంది. భవిష్యత్తులో చెట్లను అనవసరంగా నరకకుండా చూడాలి.

- వరికుప్పల లింగస్వామి, ఎన్ఎఫ్‌సీ నగర్

చెట్లను తొలగించడం బాధాకరం



జోడిమెట్ల నుంచి పోచారం వరకు రోడ్డుకు ఇరువైపలా చెట్లను విద్యుత్ సిబ్బంది ఇష్టానుసారంగా మొదళ్ల వరకు యంత్రాలతో తొలగించారు. పచ్చటి చెట్లతో కలకలాడే రోడ్డు చెట్ల నరికివేతతో కళతప్పింది. చెట్లను మొదళ్ల వరకు తొలగించడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు చెట్లను మొదళ్ల వరకు తొలగించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

- బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, పోచారం

మహిళా వృద్ధితోనే దేశాభివృద్ధి

(ఐదో పేజీ తరువాయి)

నియోజకవర్గానికి చెందిన 2,987 సంఘాల్లోని 30 వేల మంది మహిళా సభ్యులకు రూ.9.12 కోట్ల మిత్తి మాఫీ అయ్యిందని తెలిపారు. అంతకుముందు స్పీకర్‌కు డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళా సంఘాలకు చెక్కులు, అర్హులైన పేదలకు రేషన్ కార్డులను స్పీకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, హెల్త్ డైరెక్టర్ జాన్సన్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్డీవో సభ్యులు జాఫర్, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జానకి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు అనంతగిరి గుట్ట ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం అనంతగిరి గుట్టపైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ పట్టణ పార్క్ అభివృద్ధి పనులకు, పట్టణ కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో క్రీడా ప్రాంగణం పునఃనిర్మాణం, బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వన మహోత్సవంలో భాగంగా అనంతగిరి అటవీ ప్రాంతంలో మొక్కలు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రూ.కోటితో చేపట్టిన నిర్మాణాలను సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్పీకర్ వెంట అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉమేష్, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో వాసుచంద్ర ఉన్నారు.



అనంతగిరిలో మొక్కలు నాటుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

నాసిరకంగా ఖబరస్థాన్ గోడ నిర్మాణం



అంతారంలో ఖబరస్థాన్ గోడ నిర్మాణం

తాండూరురూరల్: అంతారంలో ఖబరస్థాన్ గోడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వక్ఫ్ బోర్డు నుంచి రూ.5లక్షల నిధులు మంజూరు కావడంతో ఈనిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే కాంట్రాక్టర్ చేపట్టి కాంపౌండ్ వాల్ పనులు నాసిరకంగా చేపడుతున్నారని ముస్లింలు ఆరోపిస్తున్నారు. సిమెంటు, డస్ట్ సరైన మోతాదు కలపకుండా తక్కువ ఇటువేసి గోడ నిర్మాణం చేస్తున్నారని, దీంతో అది రాలిపోతుందని తెలిపారు. నీళ్లతో క్యూరింగ్ కూడా చేయడం లేదన్నారు. ఈ విషయమై మైనార్టీ యువ నాయకులు ముస్తఫా, రఫీక్ తదితరులు కట్టిన గోడను సరైన సిమెంటు వాడకుండా పనులు చేస్తున్నారని పంచాయతీరాజ్ ఏఈ నందినికి ఫిర్యాదు చేశారు. స్పందించిన నందిని పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలుంటాయన్నారు.

స్నేహితుల ఆర్థిక సాయం



ధారూరు మండల పరిధిలోని దోర్నాలలో ఉంటున్న షమీం భర్త కిడ్నీ పాడై ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. విషయం తెలుసుకున్న యాలాల మండలం, పగిడాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి 2004-05 బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు కలిసి రూ.27వేల నగదును దోర్నాల గ్రామానికి వచ్చి ఆమె కుటుంబానికి అందజేశారు.

- ధారూరు/యాలాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ వడ్ల నందు

మోమిన్‌పేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ వడ్ల నందు పిలుపునిచ్చారు. మోమిన్‌పేట్‌లో గురువారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు మండల అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేయాలన్నారు.అనంతరం జడ్పీటీసీ ఎన్నికలకు మోమిన్‌పేట్ మండల ఇన్‌చార్జిగా శ్రీసాయి భుజంగరెడ్డిని ఎన్నుకున్నారు. ఎంపీటీసీ ఇన్‌చార్జిగా రమేశ్ ముదిరాజ్, సర్పంచ్ ఇంచార్జ్‌గా వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, చేవేళ్ల పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్ రమేశ్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటిలో మురుగు కలుస్తున్నా పట్టించుకోరా?



పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

చౌడాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటిలో మురుగునీరు చేరడంపై గ్రామస్థులు గురువారం పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. వారం రోజులుగా నీటి సరఫరా లేదని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈ క్రమంలో భగీరథ నీటిలో మురుగునీరు సరఫరా కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతోనే ఇలాంటి సమస్య ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో శ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ 5వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో మహాగణపతి పూజ, గౌరీ పూజ, సస్తి పుణ్యావాచనం, ధ్వజారోహణ గోపూజ శత కలశాభిషేకం నవగ్రహ సర్వతోభద్ర మండలి చండి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ బొండల శ్రీనివాస్, కాలనీవాసులు చంద్రశేఖర్ గౌడ్, నవీన్ గౌడ్, అనిల్ గౌడ్, ఆలయ అర్చకులు అశోక్ పంతులు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీగా కొమరయ్య

తాండూరు రూరల్: వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీగా కొమరయ్య బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రుద్రమూర్తి ఆసిఫాబాద్ జిల్లాకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాండూరు వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న కొమరయ్యను ఇన్‌చార్జి ఏడీగా నియమించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొడంగల్ రూరల్: కోస్గి బార్ అసోసియేషన్ సభ్యుడు అడ్వకేట్ మడుగు భీమేష్‌పై బుధవారం జరిగిన దాడికి నిరసనగా గురువారం కొడంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ రెడ్డి, వెంకటయ్య, బస్వరాజ్, టి.కరుణాకర్ రెడ్డి, ఏవీ. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి నుంచి బస్సు ప్రారంభం

దుద్యాల: పరిగి నుంచి దుద్యాల మండల కేంద్రానికి బస్సు సౌకర్యాన్ని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

మర్పల్లి: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మధుకర్ అన్నారు. గురువారం మండలంలోని బూచన్‌పల్లి పంచాయతీ కార్యాలయం ముందు నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు.

బోనాలకు ఏర్పాట్లు ముమ్మరం

ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్, చందుపట్లగూడ, బొక్కోనిగూడలలో బోనాల పండుగకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఆదివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని కొన్నివార్డుల్లో బోనాల పండుగను నిర్వహిస్తారు. ఇందుకోసం గతవారం రోజులుగా స్థానిక నాయకులు గ్రామదేవతల ఆలయాల వద్ద ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సమస్యలపై నిరంతర పోరాటం

పరిగి: ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం పరిగి మండల గౌరవ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌అలీ, అధ్యక్ష కార్యదర్శులు బుగ్గయ్య, రాకేష్‌లు అన్నారు. పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం పరిగి పట్టణంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

యాలాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గురువారం ఆయన మొక్కలను నాటారు.

సమావేశం బహిష్కరణ

ధారూరు: మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో గురువారం నిర్వహించిన వారాంతపు సమావేశాన్ని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. అనంతరం వారు ఎంపీవో షఫీ ఉల్లాకు వినతిపత్రం సమర్పించారు.

డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన

తాండూరు: సేవాభారతి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, పోక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన అవగాహన సదస్సులో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రమేష్, రవీందర్‌రెడ్డి, పోలీస్‌శాఖ అధికారులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

తాండూరు: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తాండూరులో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, కె.శ్రీనివాస్ కరపత్రాన్ని విడుదల చేశారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

యాలాల: చెన్నారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న వడ్ల శాంతి పాఠశాలలో గెజిటెడ్ ఉపాధ్యాయులు సుధాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

దోమ: పాలెపల్లికి చెందిన న్యాయవాది ప్రతాప్‌గౌడ్, శ్రీజ దంపతులు తమ కుమారుడి జన్మదిన సందర్భంగా గురువారం పాలెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం రాంచంద్రారెడ్డి వారిని అభినందించారు. ఉపాధ్యాయులు అనురాధ, నర్సింహులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మేడ్చల్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు మేడ్చల్, శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాములు(55) అనే వ్యక్తి గురువారం తన బైక్‌పై కండ్లకోయ నుంచి చెగుంటకు వస్తుండగా మేడ్చల్ చెక్‌పోస్టు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద లారీ ట్యాంకర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వెంకటస్వామి(56) తన స్నేహితుడు బిక్షపతితో కలిసి యాక్టీవాపై మజీద్‌పూర్ నుంచి శామీర్‌పేట్ ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బిక్షపతి వెనుక కూర్చున్న వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకటస్వామి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

మూడుచింతలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేపలవేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లింగాపూర్ తండాలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్ తండాకు చెందిన ధానవత్ నవీన్(23) ఐదుగురు స్నేహితులతో కలిసి ఉద్దెమర్రి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగిపోవడంతో గమనించిన స్నేహితులు వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో మరొకరు..

మూడుచింతలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. గజ్వేల్ మండలం బండ వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాణిరాంచందర్‌ల కుమారుడు గణేష్(24) తుర్కపల్లిలో నివాసముంటూ విద్యుత్ హెల్పర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గురువారం జీనోమ్ వ్యాలీ పరిధిలో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మృతుడి కుటుంబ సభ్యులు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే గణేష్ మృతిచెందాడని, తమకు న్యాయం చేయాలని తూర్కపల్లి నుంచి కొల్తూర్ వెళ్లే రోడ్డులో రాస్తారోకో చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కలగజేసుకుని కుటుంబసభ్యులకు సర్దిచెప్పి పంపించారు.

వ్యక్తి అదృశ్యం



రాత్లావత్ గిర్యానాయక్

పూడూరు, జూలై 17, (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన పూడూరు మండలంలో జరిగింది. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాత్లావత్ గిర్యానాయక్(56) రెండు రోజుల కిందట ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎవరైనా గుర్తిస్తే సెల్:6304674014 నెంబర్‌కు సమాచారం అందించాలని కుటుంబీకులు కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..



ఆనంద్‌బాబు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మతిస్థితిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, వెంకటాద్రిటౌన్‌షిప్‌కు చెందిన జర్రిలాల గోపాల్‌రావు కుమారుడు ఆనంద్‌బాబు(30) మతిస్థితిమితం సరిగ్గాలేక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 10న తల్లిదండ్రులు పనినిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి కుమారుడు కనిపించలేదు. దీంతో పరిసరాలను వెతికి తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను విచారించినా ఫలితం లేదు. దీంతో అతడి తండ్రి గురువారం పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు విలేకర్లు, యూట్యూబర్‌పై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి యజమానిని డబ్బులు డిమాండ్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు విలేకర్లు, ఓ యూట్యూబర్‌పై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈడబ్ల్యుఎస్ కాలనికి చెందిన పడకంటి నర్సింహాచారి జగదాంబ థియేటర్ సమీపంలో ఓ బహుళ అంతస్తు భవనాన్ని నిర్మిస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు ఓ టీవీ ఛానల్ విలేకరి వేణు, ఓదినపత్రిక(ఆంధ్రజ్యోతి కాదు) విలేకరి కార్తీక్, సుందర్ (యూట్యూబర్)లు వచ్చి అనుమతి లేకుండా మూడు అంతస్తుల భవనం ఎలా నిర్మిస్తున్నావ్ అని బెదిరించారు. తాను ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడినని, తమతో ఎనిమిది మంది ఉన్నారని, ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఇవ్వాలని వేణు డిమాండ్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. తమకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే అట్టి భవనాన్ని అధికారులకు చెప్పి కూల్చేపిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. సుందర్ అనే యూట్యూబర్ తన మొబైల్ ఫోన్‌లో వార్త రాసి ఇంటి యజమాని నర్సింహాచారికి వాట్సాప్‌కు పంపించి డబ్బులు ఇవ్వాలని హెచ్చరించారని బాధితుడు తెలిపారు. దీంతో బుధవారం సాయంత్రం ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్టాండ్‌లో సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు బస్టాండ్‌లో ప్రయాణికుల తరఫున సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ సురేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. శ్రావణమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా బస్‌లు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణ ముదిరాజ్, భద్రేశ్వర్, కృష్ణ ఉన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

వికారాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు కూర సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని ఆయా పాఠశాలల్లో గురువారం తపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ అయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు రాఘవేందర్, కార్యదర్శి సంతోష్ కుమార్, బస్వరాజ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.